




APTEL/25/A5250

మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ : నరేంద్ర

గుంటూరు | సంపుటి : 1 | సంచిక : 100 | పేజీలు : 4 | సోమవారం 13 ఏప్రిల్ 2026 | వెల : 4/-


## 18 లేదా 19న ఇంటర్ ఫలితాలు



# భారత క్వాంటం విప్లవానికి శ్రీకారం

ఏప్రిల్ 14న రెండు క్వాంటం పరీక్షా కేంద్రాల ఆవిష్కరణ

దేశంలోనే తొలిసారిగా

క్వాంటం సూచన పరీక్షా కేంద్రం ఏర్పాటుతో ఏపీకి ప్రత్యేక గుర్తింపు

పరిశోధకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులకు నూతన అవకాశాలు




*ప్రపంచ క్వాంటం దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మరో కీలక సాంకేతిక ఘట్టానికి వేదిక కానుంది. అమరావతిలో ఏర్పాటు చేసిన క్వాంటం సూచన పరీక్షా కేంద్రాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏప్రిల్ 14న ఆవిష్కరించనున్నారు. రాజధానిలోని విద్యా, పరిశోధనా సంస్థల్లో ఏర్పాటు చేసిన రెండు క్వాంటం పరీక్షా కేంద్రాలతో రాష్ట్రం సాంకేతిక రంగంలో కొత్త దిశగా అడుగులు వేస్తోంది.*

## ఇరాన్--అమెరికా చర్చలు విఫలం

- అర్ధరాత్రి వరకు జరిగిన చర్చలు ఫలితం లేకుండానే ముగింపు
- హర్మూజ్ జలసంధి తెరవాలన్న అమెరికా డిమాండ్
- ఆంక్షలు తొలగించాలన్న ఇరాన్ పట్టుదల
- చర్చల్లో ఎలాంటి పురోగతి లేదన్న అమెరికా ఉపాధ్యక్షుడు

3





## జూలై నెల శ్రీవారి దర్శన కోటా విడుదల

*తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం 2026 జూలై నెలకు సంబంధించిన వివిధ దర్శనాలు, ఆర్జిత సేవలు మరియు గదుల కోటాలను దశలవారీగా విడుదల చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానమ్ ప్రకటించింది. భక్తులు ముందస్తుగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకుని టికెట్లు పొందవచ్చని అధికారులు తెలిపారు.*

## దళితులు ఐక్యమైతేనే రాజ్యాధికారం

చింతామోహన్

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దళితున్ని ముఖ్యమంత్రిగా చేస్తామని హామీ

మాల, మాదిగలు కలసి ప్రయాణించాల్సిన సమయం వచ్చిందన్న మాజీ కేంద్ర మంత్రి

2029లో దళితులే దేశ, రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తారన్న వ్యాఖ్య

అమరావతి కాదు 'చంద్రావతి' అంటూ రాజధాని అంశంపై వ్యాఖ్యలు




*దళిత వర్గాల ఐక్యత ద్వారానే రాజకీయాధికారం సాధ్యమని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చింత మోహన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే దళితున్ని ముఖ్యమంత్రిగా చేసే సంకల్పం తమదని ఆయన వెల్లడించారు. మాల, మాదిగలు కలసి ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందని, 2029 నాటికి దళితులు దేశ, రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు.*

3

## సంగీత సామ్రాజ్ఞి ఆశా భోస్లే కన్నుమూత

ఎనిమిది దశాబ్దాల గాన ప్రయాణానికి ముగింపు

భారతీయ చిత్ర సంగీతానికి చిరస్మరణీయ స్వరం

అనేక భారతీయ భాషల్లో వేలాది పాటలు పాడిన గాయని

దాదాసాహెబ్ ఫాల్కే, పద్మవిభూషణ్ వంటి గౌరవాలు అందుకున్న మహాగాయని

భారతీయ సంగీత ప్రపంచాన్ని తన మధుర గానంతో మంత్రముగ్ధులను చేసిన ప్రఖ్యాత గాయని ఆశ భోసలే (92) కన్నుమూశారు. ముంబై నగరంలోని బ్రీచ్ క్యాండీ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఆమె తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎనిమిది దశాబ్దాలకు పైగా సాగిన ఆమె గాన ప్రయాణం భారతీయ చిత్రసంగీత చరిత్రలో స్వర్ణాక్షరాలతో నిలిచిపోతుందని సంగీతాభిమానులు పేర్కొంటున్నారు

3



## గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు శ్రీకారం

ఫేజ్--1 కింద రూ.9.55 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

2027 పుష్కరాల కోసం ఆలయాల పునర్నిర్మాణం, మౌలిక సదుపాయాల విస్తరణ

తూర్పు, పశ్చిమ గోదావరి--కోనసీమ

జిల్లాల్లో 43 దేవాలయాల అభివృద్ధి

2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని తూర్పు గోదావరి జిల్లాలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర దేవాదాయ మరియు ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ =వంసంవ తెలిపారు. రాజమహేంద్రవరం నగరంలో రూ.9.55 కోట్లతో చేపట్టనున్న పలు దేవాలయాల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.



3

## అమరావతిపై తప్పుడు ప్రచారం

మంత్రి నారాయణ

తెలంగాణ సెక్రటేరియట్, పార్లమెంట్ నిర్మాణ వ్యయాల ఉదాహరణలు వెల్లడి

అమరావతిలో నిర్మాణాలపై ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్న విమర్శ

అమరావతి పూర్తిగా స్వయం సమృద్ధి నగరంగా రూపుదిద్దుకుంటుందని స్పష్టం



3

*అమరావతి రాజధాని నిర్మాణంపై తప్పుడు లెక్కలు చూపిస్తూ గత ప్రభుత్వం ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందని పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తీవ్రంగా విమర్శించారు. అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనులపై అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు.*

## అంతరాష్ట్ర దొంగల అరెస్ట్



**పెదకూరపాడు రక్షణ న్యూస్** పల్నాడు జిల్లా పెదకూరపాడు పోలీసులకు పెద్ద సక్సెస్ దక్కింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అంతరాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. క్రోసూరు మండలం పిసపాడు గ్రామం వద్ద ప్రత్యేక బృందం నిర్వహించిన ఆపరేషన్‌లో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 30 గ్రాముల బంగారం, 69 తులాల వెండి, రూ.1 లక్ష నగదు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఇక పెదకూరపాడు, పొడపాడు ప్రాంతాల్లో జరిగిన దొంగతనాల్లో సుమారు 204 గ్రాముల బంగారం, 69 తులాల వెండి అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో పలు పోలీస్ స్టేషన్లలో వీరిపై అనేక కేసులు నమోదై ఉన్నట్లు వెల్లడైంది. ఈ ఆపరేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించిన పోలీస్ బృందాన్ని పల్నాడు జిల్లా ఎస్పీ బి కృష్ణారావు, సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు అభినందించారు. నిందితులపై కేసులు నమోదు చేసి, మరింత దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కానిస్టేబుళ్ల కిరాతకం



**చిలకలూరిపేట రక్షణ న్యూస్** పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం యడవల్లి వద్ద జరిగిన లాయర్ హరి ప్రసాద్ హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. ఈ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అక్రమ సంబంధం కారణంగా ఈ హత్య జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో పల్నాడు ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు---ఊసర్తి వెంకట కోటయ్య, కొండారెడ్డి శ్రీనివాసరావు---ప్రధాన నిందితులుగా తేలడంతో వారిని అరెస్ట్ చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు. ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన లాయర్ హరి ప్రసాద్ శుక్రవారం ఉదయం పనిమీద నరసరావుపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా, ముందుగా పన్నిన పథకం ప్రకారం నిందితులు యడవల్లి సమీపంలో అతన్ని అడ్డగించి దారుణంగా దాడి చేశారు. ఇనుప రాడ్లు, బండరాళ్లతో కొట్టి అతన్ని హత్య చేసినట్లు డీఎస్పీ హనుమంతరావు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, ప్రధాన నిందితుడు వెంకట కోటయ్యకు హరి ప్రసాద్ భార్యతో గత నాలుగేళ్లుగా అక్రమ సంబంధం కొనసాగుతున్నట్లు తెలిసింది. ఈ సంబంధం విషయమై వివాదాలు తలెత్తడంతో హత్యకు కుట్ర పన్నినట్లు పోలీసులు తెలిపారు. ఈ కుట్రను అమలు చేయడానికి తోటి కానిస్టేబుల్ శ్రీనివాసరావుకు సుమారు రూ.5 లక్షల సుపారీ ఇచ్చినట్లు విచారణలో బయటపడింది. హత్య అనంతరం నిందితులు ఎటువంటి అనుమానం రాకుండా ఉండేందుకు ప్రయత్నించినప్పటికీ, సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారం ఆధారంగా పోలీసులు వారిని గుర్తించి అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించి మరిన్ని వివరాలను సేకరిస్తూ, దర్యాప్తును మరింతగా విస్తరించారు. ఈ ఘటన పోలీసు వర్గాల్లోనూ తీవ్ర చర్చకు దారితీసింది.

## పేర్లు మార్చినంత మాత్రాన వాస్తవాలను మార్చలేరు

అరుణాచల్‌ప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు చైనా పేర్లు పెట్టడంపై భారత్ తీవ్రంగా మండిపడింది. చైనా చేస్తున్న ఈ తరహా ప్రయత్నాలను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు విదేశాంగ శాఖ ప్రకటన విడుదల చేసింది. భారత భూభాగంలోని ప్రాంతాలకు కల్పిత పేర్లు పెట్టడం ద్వారా చైనా సృష్టిస్తున్న అబద్ధపు కథనాలు ఏమాత్రం చెల్లవని పేర్కొంది. అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ పునరుద్ఘాటించారు. భవిష్యత్తులోనూ భారత్‌లో భాగంగానే ఉంటుందని చెప్పారు. పేర్లు మార్చినంత మాత్రాన వాస్తవాలను మార్చలేరని స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు ఈ చర్యలు అడ్డంకిగా మారుతున్నాయని జైస్వాల్ అభిప్రాయపడ్డారు. ఇటువంటి చర్యలు భారత్–చైనా సంబంధాల్లో ప్రతికూలతను నింపుతాయని పేర్కొన్నారు. పరస్పర అవగాహనను పెంపొందించుకునే ప్రయత్నాలను దెబ్బతీసే పనులకు చైనా స్వస్తి పలకాలని రణధీర్ జైశ్వాల్ హితవు పలికారు. ఇదిలా ఉండగా, ఇండియా–చైనా సంబంధాలు 2020లో తూర్పు లద్దాఖ్ సరిహద్దు ఉద్రిక్తతల తర్వాత తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ ఘటనల అనంతరం ఇరు దేశాలు సంబంధాలను పునరుద్ధరించేందుకు ఇరు పక్షాలు అనేక చర్యలు చేపట్టాయి. అయితే ఈ తరహా పరిణామాలు మళ్లీ ఉద్రిక్తతలను పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్‌ను దక్షిణ టిబెట్‌గా పేర్కొంటూ తన హక్కు ఉందని చైనా వాదిస్తోంది. ఈ ప్రాంతాన్ని జాంగ్నాన్‌గా పిలుస్తోంది. కానీ భారత్ మాత్రం ఈ వాదనలను పూర్తిగా తిరస్కరిస్తోంది.

## బిహార్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధం

బిహార్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ఇటీవల రాజ్యసభ సభ్యత్వాన్ని స్వీకరించి, శాసన మండలికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో బీజేపీ, జేడీయూ నాయకులు ఆయనతో క్రమం తప్పకుండా సమావేశమవుతూ, భవిష్యత్ వ్యూహాలను రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని జేడీయూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సంజయ్ కుమార్ ఝా పేర్కొన్నారు. అయితే ఆ ప్రక్రియ ఏప్రిల్ 13 తర్వాత ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ఆదివారం, జేడీయూ అధినేత నీతీశ్ కుమార్‌ను కలిసిన అనంతరం సంజయ్ ఝా విలేకరులతో మాట్లాడారు.

"బీజేపీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడేందుకు వీలుగా, నీతీశ్ ముఖ్యమంత్రి త్వరలో పదవి నుంచి వైదొలుగుతారని భావిస్తున్నాం. ఈ ప్రక్రియ ఏప్రిల్ 13 తర్వాత ప్రారంభమవుతుందని నేను భావిస్తున్నా" అయితే, సంజయ్ ఝా వెంట ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ, జేడీయూ సీనియర్ నేత, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్ కుమార్ చౌదరి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ చౌదరి విలేకరులతో మాట్లాడారు. బీజేపీ సిఫార్సు మేరకు ఎన్?డీఏ శాసనసభ్యులు కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకుంటారని తెలిపారు. "కొత్త ప్రభుత్వం ఏర్పాటులో బీజేపీ కీలక పాత్ర పోషించాల్సి ఉంది. ఈ విషయాల్లో వారికి ఒక నిర్దిష్ట ప్రక్రియ ఉంటుంది. వారు తమ ప్రణాళికతో ముందుకు వచ్చిన తర్వాత, తదుపరి చర్యలు జరుగుతాయి. బిహార్‌లో మొదటి సారిగా బీజేపీ ముఖ్యమంత్రి పదవిని పొందేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, ఆ అభ్యర్థిని మాత్రం కేంద్ర నాయకత్వమే ఎంపిక చేస్తుంది. అనంతరం ఎన్‌డీఏ శాసనసభ పక్షం ఆ పేరును ఆమోదిస్తుంది" అని విజయ్ కుమార్ చౌధరీ పేర్కొన్నారు.

### బిహార్ తదుపరి సీఎం ఎవరు

ఇదిలా ఉండగా, బిహార్‌లో తొలిసారి బీజేపీ సర్కార్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. చాలా కాలంగా సీఎం పదవిలో కొనసాగిన నీతీశ్‌కుమార్ రాజ్యసభకు వెళ్లడంతో కమలం పార్టీకి మార్గం సుగమమైంది. దీంతో బీజేపీ నుంచి ముఖ్యమంత్రి పదవి ఎవరు చేపడతారనే విషయం తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే, సీఎం రేసులో బిహార్ ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్, ఉప ముఖ్యమంత్రి విజయ్ సిన్హా పేర్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. అయితే, ఉప ముఖ్యమంత్రిగా నీతీశ్? కుమారుడు, నిశాంత్ కుమార్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

## మహిళా రిజర్వేషన్‌ను అమలుచేసే టైం వచ్చింది

మహిళా రిజర్వేషన్ చట్టాన్ని దాని నిజమైన స్ఫూర్తితో అమలుచేసే సమయం వచ్చిందంటూ లోక్‌సభ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్లకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ లేఖ రాశారు. 2029 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నుంచి మహిళా రిజర్వేషన్ కోటా అమల్లోకి వస్తుందని ఆయన వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ చట్టం (నారీ శక్తి వందన్ అధినియం)తో ముడిపడిన సవరణ బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించడానికి లోక్‌సభ, రాజ్యసభ సభ్యులంతా ఏకం కావాలని ప్రధాని పిలుపునిచ్చారు. విస్తృతమైన చర్చల తర్వాతే ఈ చట్టాన్ని త్వరితగతిన అమల్లోకి తేవాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

### ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో చారిత్రక చర్చ

"2029 నుంచి మహిళా రిజర్వేషన్ చట్టం అమల్లోకి వస్తే భారత ప్రజాస్వామిక సంస్థలకు కొత్త బలం లభిస్తుంది. వాటిపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది. ప్రభుత్వాల పాలనలో ప్రజా భాగస్వామ్యం, ప్రాతినిధ్యం మరింత పెరుగుతుంది. దీనిపై ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో చారిత్రక చర్చ మొదలుకానుంది.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌పై కఠిన నిషేధం

బెట్టింగ్, జూదంపై సున్నా సహన విధానం అమలు
ఐపీఎల్ సీజన్‌లో ప్రత్యేక దాడులకు పోలీసుల సిద్ధత
బుకీలు, ఏజెంట్లపై కఠిన కేసులు నమోదు చేయాలని ఆదేశాలు



**అమరావతి రక్షణ న్యూస్** : ఆంధ్రప్రదేశ్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ మరియు జూద కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పోలీసు ప్రధాన అధికారి హరీష్ కుమార్ గుప్త అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌పై సున్నా సహన విధానం అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ మరియు జూద కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర పోలీసు శాఖ కఠిన చర్యలు చేపడుతోంది. ఈ మేరకు రాష్ట్ర పోలీసు ప్రధాన అధికారి హరీష్ కుమార్ గుప్త ఫీల్డ్ స్థాయి పోలీసు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ క్రికెట్ సీజన్ నేపథ్యంలో ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలు పెరిగే అవకాశముండటంతో ప్రత్యేక అమలు దాడులు నిర్వహించాలని పోలీసులకు సూచించారు. బెట్టింగ్ నెట్‌వర్క్‌లను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్లబ్‌లు, స్థావరాలు లేదా ఇతర ప్రదేశాల్లో జూదం నిర్వహిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే వాటిని మూసివేయాలని డీజీపీ ఆదేశించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు సంబంధించిన మొబైల్ అనువర్తనాలు మరియు వెబ్‌సైట్లను గుర్తించి వాటిపై నిఘా పెంచాలని తెలిపారు. బెట్టింగ్ నిర్వహిస్తున్న బుకీలు, ఏజెంట్లపై సంఘటిత నేరాల కింద కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. అవసరమైతే వారి బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసే చర్యలు కూడా చేపట్టాలని పేర్కొన్నారు. యువతలో బెట్టింగ్ అలవాటు పెరగకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కూడా డీజీపీ ఆదేశించారు. బెట్టింగ్ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో చట్ట విరుద్ధంగా జరిగే బెట్టింగ్, జూద కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు.

## దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శాంతి సస్పెండ్



**అమరావతి రక్షణ న్యూస్** ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణల నేపథ్యంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శాంతిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ చర్యలు తీసుకున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణల నేపథ్యంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శాంతిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

శాంతి వద్ద ఆదాయానికి మించి సుమారు రూ.1.37 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు విచారణలో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ అంశంపై ఏప్రిల్ 6న కేసు నమోదు చేయగా, అనంతరం ఏప్రిల్ 7న ఆమెను అరెస్ట్ చేసినట్లు సమాచారం.

ప్రభుత్వ ఉద్యోగి 48 గంటలకు మించి కస్టడీలో ఉంటే సస్పెన్షన్ విధించే నిబంధనల ప్రకారం శాంతిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

సస్పెన్షన్ కాలంలో శాంతి అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను విడిచి వెళ్లరాదని కూడా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. కేసుకు సంబంధించిన దర్యాప్తు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

## ఏటీఎం నగదు దోపిడి




**పిడుగురాళ్ల రక్షణ న్యూస్** పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో ఏటీఎంలలో భారీ నగదు గోల్‌మాల్ వెలుగులోకి వచ్చి కలకలం రేపుతోంది. ఎస్బీఐ మరియు సెంట్రల్ బ్యాంక్‌కు చెందిన మొత్తం నాలుగు ఏటీఎంలలో రూ.87 లక్షల నగదు చోరీకి గురైనట్లు సిఎంఎస్ అధికారులు గుర్తించారు. సిఎంఎస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణలో ఉన్న ఈ ఏటీఎంలలో ఇటీవల ఆడిట్ నిర్వహించగా నగదు లోటు బయటపడింది.మూడు ఎస్బీఐ, ఒక సెంట్రల్ బ్యాంక్ ఏటీఎంలలో డిపాజిట్ చేసిన నగదు రికార్డులకు, వాస్తవ నగదుకు తేడా ఉన్నట్లు గుర్తించిన అధికారులు వెంటనే విచారణ ప్రారంభించారు. ప్రాథమిక దర్యాప్తులో సిఎంఎస్ సంస్థకు చెందిన ఉద్యోగి నరేష్ ఈ ఘటనలో కీలక పాత్ర పోషించినట్లు అనుమానిస్తున్నారు.ఘటన వెలుగులోకి వచ్చిన తరువాత నరేష్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండటంతో అతడు పరారీలో ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ మేరకు సిఎంఎస్ జిల్లా మేనేజర్ సిహెచ్ అనిల్ కుమార్ పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజ్‌లు, నగదు లావాదేవీల రికార్డులు సేకరిస్తూ దర్యాప్తును వేగవంతం చేశారు.ఏటీఎంల భద్రతపై ఈ ఘటన అనేక అనుమానాలు రేకెత్తించగా, నగదు లోడింగ్ మరియు మానిటరింగ్ విధానాల్లో లోపాలపై అధికారులు దృష్టి సారించారు. పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

## పేదలకు ఉచిత విద్యుత్ లక్ష్యం



**చిలకలూరిపేట రక్షణ న్యూస్** పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం దండమూడిలో పీఎం సూర్యాఘర్ పథకం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంటికి ఉచిత విద్యుత్ అందించడమే సూర్యాఘర్ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సహకారంతోనే ప్రజలకు ఉచిత విద్యుత్ అందించగలమని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.రాష్ట్ర అభివృద్ధి కోసం నారా చంద్రబాబు నాయుడు విధ్వంసకర రాజకీయ దుష్టశక్తులతో పోరాడుతున్నారని వ్యాఖ్యానించారు. ప్రజల కోసం కష్టపడే నాయకులను గుర్తించి ఆదరించాలని, అప్పుడే అవకాశవాద రాజకీయాలకు చెక్ పడుతుందని అన్నారు.

ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకొస్తున్న పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# అమర్‌నాథ్ యాత్ర జులై 3 నుంచి ప్రారంభం



దక్షిణ కశ్మీర్‌లోని పవిత్ర హిందూ క్షేత్రం అమర్‌నాథ్ యాత్ర 2026కు సంబంధించి తేదీలను జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ ఏడాది యాత్ర జూలై 3 నుంచి ప్రారంభమై, మొత్తం 57 రోజుల పాటు కొనసాగి ఆగస్టు 28న రక్షా బంధన్ సందర్భంగా ముగియనుంది. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఆయన శ్రీ అమర్‌నాథ్‌జీ శ్రైన్ బోర్డు (ఎస్ఏఎస్‌బీ) చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.

### ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా

యాత్ర ప్రారంభానికి ముందు జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా జూన్ 29న తొలి పూజ (ప్రథమ పూజ) నిర్వహించనున్నారు. ఈ పూజతో యాత్రకు శుభారంభం అవుతుంది. ప్రతీ ఏడాది లాగే ఈసారి కూడా దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉంది. యాత్రలో పాల్గొనాలనుకునే భక్తుల కోసం ఏప్రిల్ 15 నుంచి ముందస్తు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇది ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉంటుంది.

### ప్రతి యాత్రికుడికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి

దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 550కి పైగా బ్యాంక్ శాఖల్లో నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ముఖ్యంగా జమ్మూ కాశ్మీర్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యెస్ బ్యాంక్ వంటి బ్యాంకులు ఈ ప్రక్రియలో భాగస్వామ్యం అవుతున్నాయి. అదేవిధంగా అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. యాత్రలో పాల్గొనే భక్తులకు వయోపరిమితులు కూడా విధించారు. 13 సంవత్సరాల లోపు పిల్లలు, 70 సంవత్సరాల పైబడిన వృద్ధులకు యాత్రలో పాల్గొనే అనుమతి లేదు. భక్తుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతేకాకుండా ప్రతి యాత్రికుడికి రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. అమర్‌నాథ్ యాత్ర రెండు ప్రధాన మార్గాల ద్వారా కొనసాగుతుంది. అనంతనాగ్ జిల్లాలోని నున్వాన్--పహల్గాం మార్గం సంప్రదాయ మార్గంగా పరిగణించబడుతుంది. ఇది సుమారు 48 కిలోమీటర్ల పొడవు కలిగి ఉంటుంది. మరోవైపు గందర్‌బల్ జిల్లాలోని బాల్టాల్ మార్గం సుమారు 14 కిలోమీటర్ల మాత్రమే ఉన్నప్పటికీ, ఇది కొంచెం కఠినమైన మార్గంగా భావిస్తారు. భక్తులు తమ సామర్థ్యాన్ని బట్టి ఈ రెండు మార్గాల్లో ఏదైనా ఒకదాన్ని ఎంచుకోవచ్చు.

యాత్రను సురక్షితంగా, సజావుగా నిర్వహించేందుకు జమ్మూకశ్మీర్ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడంతో పాటు వైద్య సదుపాయాలు, రవాణా, నివాస ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టింది. గత కొన్నేళ్లుగా బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్ఓ) ద్వారా పహల్గాం, బాల్టాల్ మార్గాలను మెరుగుపరిచారు. రహదారులను విస్తరించి, పక్కాగా నిర్మించడం వల్ల యాత్రికులకు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారింది. ఈసారి యాత్రలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. శ్రీనగర్, జమ్మూ ప్రాంతాల్లో బాబా బర్ఫానిగా ప్రసిద్ధి చెందిన అమర్‌నాథ్ స్వామికి అంకితంగా లేజర్, సౌండ్ షోలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా జమ్మూ–కాశ్మీర్ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇక భక్తుల భద్రత కోసం బీమా పరిమితిని కూడా పెంచారు. యాత్రికులు, సేవా సిబ్బంది, అధికారులు, పూజారులు, తాత్కాలిక కార్మికులకు ప్రమాద బీమాను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు అధికారులు తెలిపారు. ఇది యాత్రలో పాల్గొనే వారందరికీ అదనపు భరోసా కల్పించనుంది.

ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు పాల్గొనే అమర్‌నాథ్ యాత్ర దేశంలోనే అత్యంత ముఖ్యమైన ఆధ్యాత్మిక యాత్రలలో ఒకటిగా గుర్తింపు పొందింది. 3,880 మీటర్ల ఎత్తులో ఉన్న అమర్‌నాథ్ గుహలో సహజంగా ఏర్పడే మంచు శివలింగాన్ని దర్శించుకోవడం కోసం భక్తులు కష్టసాధ్యమైన ప్రయాణాన్ని చేపడతారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన యాత్ర అనుభవాన్ని అందించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఏప్రిల్ 15 నుంచి ప్రారంభమయ్యే రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాల్గొని, ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులు భక్తులకు సూచిస్తున్నారు.

మన రాజధాని రక్షణ నిజం మా బలం

సోమవారం 13 ఏప్రిల్ 2026

## సంగీత సామ్రాజ్ఞి ఆశా భోస్లే కన్నుమూత

**ముంబై రక్షణ న్యూస్**

భారతీయ చిత్రసంగీత ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచిన మధుర గాత్రం నిశ్శబ్దమైంది. ప్రముఖ గాయని ఆశ భోసలే కన్నుమూశారు. ముంబైలోని బ్రీచ్ క్యాండీ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఆమె తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆమె వయస్సు 92 సంవత్సరాలు. ఆమె మరణంతో భారతీయ సంగీత ప్రపంచం ఒక మహత్తర గానాన్ని కోల్పోయింది. ప్రఖ్యాత గాయని లత మంగేష్కర్ సోదరిగా సంగీత రంగంలోకి అడుగుపెట్టిన ఆశా భోస్లే తన ప్రత్యేక గాత్రంతో త్వరలోనే స్వంత గుర్తింపును సంపాదించారు. 1950 దశకంలో చిత్రసంగీతంలో తన ప్రయాణాన్ని ప్రారంభించిన ఆమె 1952లో వచ్చిన "సంగ్దిల్" చిత్రంతో గుర్తింపు పొందారు. అనంతరం "పరిణీత", "బూట్ పాలిష్" వంటి చిత్రాలలో పాడిన పాటలతో ప్రముఖ దర్శకుల దృష్టిని ఆకర్షించారు. హిందీ, మరాఠీతో పాటు అనేక భారతీయ భాషల్లో వేలాది పాటలు పాడిన ఆశా భోస్లే ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ గాన ప్రయాణాన్ని కొనసాగించారు. ముఖ్యంగా 1970 దశకంలో ఆమె పాడిన "పియా తూ అబ్ తో ఆజా", "దమ్ మారో దమ్", "చురా లియా హై తుమ్నే" వంటి పాటలు సంగీత ప్రపంచంలో విశేష ఆదరణ పొందాయి.

అలాగే ప్రముఖ గాయకుడు మహమ్మద్ రఫీ తో కలిసి ఆమె పాడిన "మాంగ్ కే సాథ్ తుమ్హారా", "సాథీ హాత్ బఢానా", "ఉదేన్ జబ్ జబ్ జుల్ఫేన్ తేరీ" వంటి పాటలు నేటికీ ప్రజాదరణ పొందిన పాటలుగా నిలిచాయి. ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్ . డి . బుర్మన్ సంగీత దర్శకత్వంలో ఆమె పాడిన పాటలు అప్పట్లో కొత్త ధోరణికి శ్రీకారం చుట్టాయి. "ఆజా ఆజా", "పియా తూ అబ్ తో ఆజా", "యే మేరా దిల్" వంటి పాటలు అప్పటి యువతను విపరీతంగా ఆకట్టుకున్నాయి. వాణిజ్యపరమైన పాటలకే పరిమితం కాకుండా గజల్ గానంలో కూడా ఆశా భోస్లే తన ప్రతిభను చాటుకున్నారు. గజల్ ఆల్బమ్‌ల ద్వారా ఆమె జాతీయ స్థాయి ప్రశంసలను అందుకున్నారు. 1990 దశకంలో విడుదలైన రంజీల చిత్రంలోని పాటలతో కొత్త తరాన్ని కూడా ఆకట్టుకున్నారు. సంగీత రంగానికి చేసిన అపార సేవలకు గాను ఆశా భోస్లేకు భారత ప్రభుత్వం అత్యున్నత గౌరవాలను ప్రదానం చేసింది. ఆమెకు దడసాహెబ్ ఫలకే అవార్డు తో పాటు పద్మ విభూషణ్ పురస్కారాలు లభించాయి. ఎనిమిది దశాబ్దాలకు పైగా సాగిన ఆమె గాన ప్రయాణం భారతీయ సంగీత చరిత్రలో ఒక స్వర్ణయుగాన్ని ప్రతిబింబిస్తుంది. కోట్లాది సంగీతాభిమానులను తన గాత్రంతో అలరించిన ఆశా భోస్లేను అభిమానులు "సంగీత సామ్రాజ్ఞి"గా కీర్తిస్తారు. ఆమె మరణం భారతీయ సంగీత ప్రపంచానికి తీరని లోటుగా నిలిచింది.

## దళితులు ఐక్యమైతేనే రాజ్యాధికారం...

**చిత్తూరు రక్షణ న్యూస్**

చిత్తూరులో జరిగిన మాలల ఆత్మీయ కలయిక సభలో కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింత మోహన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం చిత్తూరులోని అంబేద్కర్ భవన్‌లో ప్రముఖ దళిత నాయకుడు పరదేశి ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చింతామోహన్ దళిత వర్గాల ఐక్యతపై ప్రాముఖ్యతను వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాల, మాదిగలు కలసి ప్రయాణించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఓబీసీలు కూడా దళితులతో కలసి వస్తేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. 2029 సంవత్సరానికి దేశ, రాష్ట్ర రాజకీయాల్లో దళితుల ప్రభావం పెరుగుతుందని తెలిపారు.

చిత్తూరు జిల్లాలో పుట్టిన చంద్రబాబు నాయుడు జిల్లాకు ఏమి చేశారో తెలియదని ఆయన విమర్శించారు. దళితులను ఏ, బి, సి, డి వర్గాలుగా విభజించడం ద్వారా పెద్ద తప్పు జరిగిందన్నారు. పక్క రాష్ట్రం తమిళనాడులో మాత్రం అటువంటి విభజన లేదని ఆయన పేర్కొన్నారు. అక్కడి ముఖ్యమంత్రి ఎం . కె . స్టాలిన్ ఆ విధంగా చేయలేదని ఉదాహరణగా చెప్పారు.

ఏపీలో ఎస్సీలను బలహీనపరచేందుకు దళిత వర్గీకరణ జరిగిందని ఆయన ఆరోపించారు. చిత్తూరు జిల్లాలో దళితుల్లో ఒక్కరైనా కోటీశ్వరుడు ఉన్నాడా అని ప్రశ్నించారు. ఎక్కువమంది ఎస్సీలు ఆర్థిక ఇబ్బందులతో జీవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అలాగే మాజీ ముఖ్యమంత్రి వై . స్ . జగన్ మోహన్ =వ఻఻఻ మరియు చంద్రబాబు ఇద్దరూ కలిసి ఎస్సీ కార్పొరేషన్లను మూసేశారని ఆయన ఆరోపించారు. విద్యార్థులకు విద్యాసహాయం నిలిపివేశారని, ఫుల్ బిల్లులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదని విమర్శించారు.

తిరుపతిలో దళిత విద్యార్థినులు జీవనోపాధి కోసం మరుగుదొడ్లు శుభ్రం చేసే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేందుకు తాను కట్టుబడి ఉన్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాజ్యాంగ సవరణ చేసి వారికి ఆ హోదా కల్పిస్తామని చెప్పారు.

రాజధాని అంశంపై కూడా ఆయన వ్యాఖ్యలు చేశారు. రాయలసీమలో పుట్టిన ా జగన్ మోహన్ రెడ్డి మరియు చంద్రబాబు ఇద్దరూ కోనసీమలో రాజధాని కోసం పోటీ పడుతున్నారని అన్నారు. తాను మాత్రం తిరుపతి రాజధానిగా ఉండాలని కోరుకుంటున్నానని చెప్పారు. ఈ విషయమై గతంలో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కు లేఖ కూడా రాసినట్లు గుర్తుచేశారు.

అమరావతి చట్టం కూడా అనేక చట్టాల మాదిరిగానే ఉందని ఆయన వ్యాఖ్యానించారు. అమరావతి కాదు అది "చంద్రావతి" అని ఆయన ఎద్దేవా చేశారు. అమరావతిని ఒక్క చంద్రబాబు నాయుడు మాత్రమే ఇష్టపడుతున్నారని, రాయలసీమ మరియు ఉత్తరాంధ్ర ప్రజలు రాజధానిగా అంగీకరించడం లేదని అన్నారు.

చిత్తూరు జిల్లాలో ఒక ఎస్సీ పార్లమెంటు సభ్యుడు, ముగ్గురు ఎస్సీ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ మంత్రివర్గంలో అవకాశం దక్కకపోవడంపై ప్రశ్నించగా ఆయన స్పందించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే దళితున్ని ముఖ్యమంత్రిగా చేస్తామని స్పష్టం చేశారు. మాల, మాదిగలు ఐక్యంగా ముందుకు సాగితే రాజ్యాధికారం తప్పకుండా సాధ్యమవుతుందని చింతామోహన్ తెలిపారు.

## 18 లేదా 19న ఇంటర్ ఫలితాలు

**అమరావతి రక్షణ న్యూస్**



ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ప్రజా పరీక్షల ఫలితాలను ఈ నెల 18 లేదా 19 తేదీల్లో విడుదల చేసే అవకాశముందని ఇంటర్మీడియట్ విద్యా మండలి వర్గాలు తెలిపాయి. మూల్యాంకన ప్రక్రియ ఇప్పటికే పూర్తికాగా ఫలితాల విడుదలకు అవసరమైన సాంకేతిక ప్రక్రియ కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రథమ మరియు ద్వితీయ సంవత్సరం ప్రజా పరీక్షల ఫలితాలను త్వరలో ప్రకటించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఫలితాలను ఈ నెల 18 లేదా 19 తేదీల్లో విడుదల చేసే అవకాశముందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే సమాధాన పత్రాల మూల్యాంకన ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఫలితాల ప్రకటనకు సంబంధించిన సాంకేతిక ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రక్రియ ఈ నెల 16వ తేదీ నాటికి పూర్తయ్యే అవకాశముందని సమాచారం. ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ ప్రజా పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమై మార్చి 23 వరకు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో కొన్ని కొత్త సంస్కరణలను అమలు చేయడంతో పరీక్షల నిర్వహణకు సాధారణం కంటే ఎక్కువ సమయం పట్టింది. పరీక్షల నిర్వహణలో మార్పులు తీసుకురావడంతో పాటు భద్రతా చర్యలను కూడా కట్టుదిట్టం చేశారు. ఈ కారణంగా మూల్యాంకన ప్రక్రియ పూర్తికావడంలో కొంత ఆలస్యం జరిగిందని అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుతం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి త్వరలోనే ఫలితాలను విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారులు వెల్లడించారు ఫలితాలు విడుదలైన తరువాత విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ ఫలితాలను పరిశీలించుకునే అవకాశం ఉంటుంది.

## జూలై నెల శ్రీవారి దర్శన కోటా విడుదల

**తిరుపతి రక్షణ న్యూస్**

తిరుమలలో శ్రీవారి దర్శనానికి సంబంధించిన జూలై నెల కోటాలను విడుదల చేసే తేదీలను తిరుమల తిరుపతి దేవస్థానము ప్రకటించింది. ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు, ప్రత్యేక దర్శనాలు, వర్చువల్ సేవలు మరియు గదుల బుకింగ్‌కు సంబంధించిన కోటాలను ఏప్రిల్ 18 నుండి దశలవారీగా విడుదల చేయనున్నారు. శ్రీవారి ఆర్జిత సేవలకు సంబంధించిన టికెట్ల కోటాను ఏప్రిల్ 18 ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. ఇందులో సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవలు ఉంటాయి. ఈ సేవల టికెట్ల కోసం ఎలక్ట్రానిక్ డిప్ విధానంలో నమోదు చేసుకునేందుకు భక్తులకు అవకాశం కల్పించారు. ఇందుకోసం ఏప్రిల్ 20 ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. ఎంపికైన భక్తులు ఏప్రిల్ 20 నుండి 22 మధ్యాహ్నం 12 గంటలలోపు చెల్లింపు పూర్తి చేస్తే టికెట్లు మంజూరు చేస్తారు. ఆర్జిత సేవలకు సంబంధించిన మరో విడత టికెట్లను ఏప్రిల్ 21 ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. ఇందులో కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలకు సంబంధించిన టికెట్లు అందుబాటులో ఉంటాయి. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలకు సంబంధించిన కోటాను విడుదల చేయనున్నారు. ఈ సేవలకు సంబంధించిన దర్శన సమయాల కోటా కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నారు. అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను ఏప్రిల్ 23 ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అదే రోజు ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను విడుదల చేయనున్నారు. వృద్ధులు, దివ్యాంగులు మరియు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న భక్తులకు ప్రత్యేకంగా ఉచిత దర్శన టోకెన్లను కూడా అందుబాటులో ఉంచనున్నారు. వీటి కోటాను ఏప్రిల్ 23 మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఏప్రిల్ 24 ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల మరియు తిరుపతిలోని గదుల బుకింగ్‌కు సంబంధించిన కోటాను కూడా ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. భక్తులు శ్రీవారి దర్శనానికి సంబంధించిన టికెట్లు మరియు సేవలను అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు. ముందస్తు ప్రణాళికతో భక్తులు టికెట్లు బుక్ చేసుకుని దర్శనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు శ్రీకారం

**అమరావతి రక్షణ న్యూస్**

2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లాలో ఆలయాల అభివృద్ధి మరియు మౌలిక సదుపాయాల విస్తరణ పనులను ప్రారంభించారు. ఆదివారం రాజమహేంద్రవరం నగరంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఫేజ్--1 కింద రూ.9.55 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర దేవాదాయ మరియు ధర్మాదాయ శాఖ మంత్రి అనమ్ రామనారాయణ రెడ్డి శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి , రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ , ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి వేద పండితులు, వేద పాఠశాల విద్యార్థులు పూర్ణకుంభంతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2027 జూన్ 26 నుంచి గోదావరి పుష్కరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తుగా ఆలయాల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పుష్కరాల నిర్వహణపై ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో మూడు కీలక సమావేశాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

రాజమహేంద్రవరం నగరంలో రూ.9.55 కోట్ల వ్యయంతో ఆరు దేవాదాయ సంస్థల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో శ్రీ పందిరి మహాదేవుడు కోటిలింగాల సత్రం పిండప్రదాన భవన నిర్మాణానికి రూ.3 కోట్లు, శ్రీ రమ సత్యనారాయణ స్వామి దేవస్థానం ముఖ మండప నిర్మాణానికి రూ.1 కోటి, శ్రీ రాజమండ్రి నూనేవర్తకుల అన్నదాన సమాజం అన్నదాన భవనానికి రూ.70 లక్షలు, శ్రీ రామలింగ చౌడేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి రూ.55 లక్షలు, శ్రీ గౌతమీ జీవకారుణ్య సంఘం భవన నిర్మాణానికి రూ.2.80 కోట్లు, శ్రీ చందా సత్రం కళ్యాణ మండపం మొదటి అంతస్తు నిర్మాణానికి రూ.1.50 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

ఈ పనులు పూర్తయిన తరువాత భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి పేర్కొన్నారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి మరియు కోనసీమ జిల్లాల్లోని 43 దేవాలయాల అభివృద్ధి కోసం రూ.51.79 కోట్ల నిధులు మంజూరు చేసి ఇప్పటికే టెండర్లు పిలిచినట్లు వెల్లడించారు.

గోదావరి పుష్కరాలు రాష్ట్ర ప్రతిష్ఠకు సంబంధించిన అంశమని, ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశ విదేశాల నుంచి సుమారు 10 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశముండటంతో మౌలిక సదుపాయాలను విస్తృతంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గోదావరి నది ప్రవహించే 212 కిలోమీటర్ల పరిధిలో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు, కాకినాడ జిల్లాల్లో పుష్కర స్నానాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు.

రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన మహోత్సవమని పేర్కొన్నారు. యాత్రికులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పుష్కరాల నేపథ్యంలో మంత్రి పర్యటన సంతోషదాయకమని పేర్కొన్నారు. స్థానిక దేవాలయాల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం అభినందనీయమని అన్నారు. 2027 గోదావరి పుష్కరాల సందర్భంగా మరిన్ని నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, ప్రాంతీయ సంయుక్త కమిషనర్ వి. త్రినాధరావు, రాష్ట్ర స్థాపతి పి. పరమేశ్వరప్ప, చీఫ్ ఇంజనీర్ శేఖర్, ఇతర అధికారులు మరియు ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతిని కలవనున్న మంత్రి నారా లోకేష్

**ఢిల్లీ రక్షణ న్యూస్** విద్య, సమాచార సాంకేతిక శాఖల మంత్రి నారా లోకేష్ ఢిల్లీకి చేరుకున్నారు. అక్కడికి చేరుకున్న ఆయనకు తెలుగు దేశం పార్టీ పార్లమెంట్ సభ్యులు స్వాగతం పలికారు. అమరావతి బిల్లుకు ఆమోదం తెలిపినందుకు రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలియజేయనున్నట్లు సమాచారం.



విద్య, సమాచార సాంకేతిక శాఖల మంత్రి నారా లోకేష్ సోమవారం ఢిల్లీకి చేరుకున్నారు. ఢిల్లీకి చేరుకున్న ఆయనకు తెలుగు దేశం పార్టీ పార్లమెంట్ సభ్యులు స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా రేపు మధ్యాహ్నం జాతీయ ప్రజాస్వామ్య కూటమి పార్లమెంట్ సభ్యులతో కలిసి భారత రాష్ట్రపతి ద్రౌపది మురము ను మంత్రి నారా లోకేష్ కలవనున్నారు. అమరావతి బిల్లుకు ఆమోదం తెలిపినందుకు రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలియజేయనున్నారు.

రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన అమరావతి రాజధాని అంశంలో రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయానికి ధన్యవాదాలు తెలియజేయడానికి ఈ భేటీ ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా రాష్ట్ర రాజధాని అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కూడా చర్చ జరిగే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

ఈ భేటీలో జాతీయ ప్రజాస్వామ్య కూటమికి చెందిన పార్లమెంట్ సభ్యులు కూడా పాల్గొని రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలియజేయనున్నారు.

## భారత క్వాంటం విప్లవానికి శ్రీకారం

**అమరావతి రక్షణ న్యూస్**

అమరావతి కేంద్రంగా దేశంలోనే తొలిసారిగా క్వాంటం సాంకేతిక పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ సాంకేతిక రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతోంది. ప్రపంచ క్వాంటం దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 14న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు క్వాంటం కంప్యూటర్ పరీక్షా కేంద్రాలను ప్రారంభించనున్నారు. రాజధాని ప్రాంతంలో ఏర్పాటైన ఈ కేంద్రాలు గన్నవరంలోని మేధా గోపురాలు మరియు అమరావతిలోని శ్రీరామస్వామి విద్యాసంస్థ ప్రాంగణంలో ఏర్పాటు చేయబడ్డాయి. ఈ రెండు కేంద్రాలను వరుసగా "ఒక క్యూ" మరియు "ఒక ఎస్" పేర్లతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంతో అమరావతి క్వాంటం వ్యాలీ ప్రాజెక్టుకు అధికారిక ప్రారంభం లభించనుంది. ఈ క్వాంటం పరీక్షా కేంద్రాలు క్వాంటం కంప్యూటర్ ఉపకరణాలను పరీక్షించి ధృవీకరించే విధంగా రూపొందించబడ్డాయి. క్వాంటం కంప్యూటర్ పరికరాలు తయారు చేసే సంస్థలు, పరిశోధకులు, విద్యార్థులు మరియు సాంకేతిక నిపుణులకు ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉండనున్నాయి. మేధా గోపురాలలో క్యూబిటెక్ సంస్థ ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రం క్వాంటం కంప్యూటర్ పరికరాల పరిశోధనలకు తోడ్పడనుంది. అలాగే శ్రీరామస్వామి విద్యాసంస్థలో ఏర్పాటు చేసిన కేంద్రం సూపర్ కండక్టింగ్ సాంకేతిక విధానంతో పనిచేయనుంది. ఈ రెండు పరీక్షా కేంద్రాల్లో మైనస్ 273 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద పనిచేసే ప్రత్యేక పరికరాలు ఏర్పాటు చేశారు. ఈ సాంకేతికత ద్వారా క్వాంటం పరికరాలను ఖచ్చితంగా పరీక్షించే అవకాశం లభిస్తుంది. ఈ రెండు కేంద్రాల ఏర్పాటులో దేశంలోని ప్రముఖ పరిశోధనా సంస్థలు సహకారం అందించాయి. టాటా ప్రాథమిక పరిశోధనా సంస్థ, భారతీయ విజ్ఞాన సంస్థ మరియు రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ వంటి సంస్థలు సాంకేతిక సహకారం అందించినట్లు అధికారులు తెలిపారు. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటైన ఈ క్వాంటం పరీక్షా కేంద్రాల ప్రారంభోత్సవానికి క్వాంటం రంగంలో పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, ప్రముఖ విద్యాసంస్థల అధ్యాపకులు, సాంకేతిక రంగ నిపుణులు హాజరు కానున్నారు. అలాగే దేశంలోని పలు విద్యాసంస్థల నుంచి పరిశోధకులు కూడా పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు మరియు కళాశాలల విద్యార్థులు ప్రత్యక్ష ప్రసారంగా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. దాదాపు లక్షన్నర మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించే అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు. క్వాంటం సాంకేతిక రంగంలో ఈ అడుగు దేశీయ పరిశోధనలకు కొత్త అవకాశాలను అందించడంతో పాటు అమరావతిని అంతర్జాతీయ సాంకేతిక కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా కీలకంగా మారనుందని అధికారులు భావిస్తున్నారు.

## ఇరాన్--అమెరికా చర్చలు విఫలం..

**రక్షణ మెయిన్ డెస్క్ :** మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గించే ఉద్దేశంతో జరిగిన ఇరాన్--అమెరికా చర్చలు ఎలాంటి ఫలితం లేకుండానే ముగిశాయి. కీలక అంశాలపై రెండు దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో చర్చలు అర్ధరాంతంగా ముగిశాయని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తెలిపారు. ముఖ్యంగా స్ట్రైట్ అఫ్ హార్ముజ్ తెరవాలన్న అమెరికా డిమాండ్, తమపై విధించిన ఆంక్షలను తొలగించాలన్న ఇరన్ పట్టుదలతో చర్చలు నిలిచిపోయినట్లు ఆయన వెల్లడించారు. మధ్యప్రాచ్య ప్రాంతంలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా మరియు ఇరాన్ మధ్య జరిగిన కీలక దౌత్య చర్చలు ఫలితం లేకుండానే ముగిశాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలోని బృందం ఇరాన్ ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై చర్చలు జరిపింది. అయితే రెండు దేశాల మధ్య ప్రధాన అంశాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో చర్చలు అర్ధరాంతంగా ముగిసినట్లు అమెరికా వర్గాలు వెల్లడించాయి. ఈ చర్చల్లో ప్రధానంగా స్ట్రైట్ అఫ్ హార్ముజ్ జలసంధి సమస్య ప్రధానంగా చర్చకు వచ్చింది. ప్రపంచ చమురు రవాణాలో కీలక పాత్ర పోషించే ఈ జలసంధిని పూర్తిగా తెరవాలని అమెరికా డిమాండ్ చేసింది. గల్ఫ్ ప్రాంతంలో నౌకాశ్రయాల భద్రత, అంతర్జాతీయ చమురు సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు ఇది అవసరమని అమెరికా వాదించింది. అయితే మరోవైపు ఇరన్ మాత్రం తమ దేశంపై అమెరికా విధించిన ఆర్థిక ఆంక్షలను ముందుగా తొలగించాలని స్పష్టంగా డిమాండ్ చేసింది. ఆంక్షలు కొనసాగుతున్న పరిస్థితుల్లో ఎలాంటి ఒప్పందాలు సాధ్యం కావని ఇరాన్ ప్రతినిధులు చెప్పినట్లు సమాచారం. ఈ అంశంలో రెండు దేశాలు రాజీకి రాకపోవడంతో చర్చలు నిలిచిపోయాయి. చర్చలు ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో జరిగిన చర్చల్లో ఎలాంటి పురోగతి సాధించలేకపోయామని ఆయన స్పష్టం చేశారు. "మా డిమాండ్లను ఇరాన్ అంగీకరించలేదు. చర్చల్లో సానుకూల నిబద్ధత కనిపించాలి. ఇప్పటి పరిస్థితుల్లో ఎలాంటి ముందడుగు పడలేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇక ఈ పరిణామం ఇరాన్‌కు కూడా అనుకూలంగా ఉండదని జేడీ వాన్స్ పేర్కొన్నారు. ప్రపంచ వాణిజ్యం మరియు చమురు సరఫరాకు కీలకమైన అంశాల్లో ఇరాన్ సహకారం అవసరమని ఆయన తెలిపారు. భవిష్యత్తులో చర్చలు కొనసాగాలంటే ఇరాన్ వైపునుంచి సానుకూల సంకేతాలు రావాలని అమెరికా స్పష్టం చేసింది.

ఈ చర్చలు విఫలం కావడంతో మధ్యప్రాచ్య ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి సమస్య ప్రపంచ చమురు మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో ప్రపంచ దేశాలు ఈ పరిణామాలను దగ్గరగా గమనిస్తున్నాయి.

ఇకపై ఇరాన్--అమెరికా సంబంధాలు ఏ దిశగా సాగుతాయన్నది అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక అంశంగా మారింది. రెండు దేశాలు మళ్లీ చర్చలకు సిద్ధమవుతాయా లేదా ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయా అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.

## అమరావతిపై తప్పుడు ప్రచారం

**విజయవాడ రక్షణ న్యూస్**


విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి . నారాయణ అమరావతి రాజధాని నిర్మాణంపై గత ప్రభుత్వ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అమరావతిపై తప్పుడు లెక్కలు చూపిస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలు ప్రశాంతంగా ఉంటే సహించలేకనే ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మంత్రి అన్నారు. అమరావతి రాజధాని విషయంపై గత పాలకులు ఒక్కొక్కరు ఒక్కో విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. 2014 నుంచి 2019 వరకు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో గుంటూరు--విజయవాడ మధ్య రాజధాని ఏర్పాటు చేయాలని చెప్పినవారే అధికారంలోకి వచ్చిన తరువాత మూడు రాజధానుల ప్రతిపాదన తెరపైకి తీసుకువచ్చారని మంత్రి గుర్తు చేశారు. దీంతో రాష్ట్ర ప్రజలను గందరగోళానికి గురిచేసి రైతులను కోర్టుల చుట్టూ తిప్పారని ఆయన ఆరోపించారు. రాజధానిలో భూములు ఇచ్చిన రైతులపై కేసులు పెట్టి వేధింపులకు గురిచేసిన ఘటనలను ప్రజలు మరచిపోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతి నిర్మాణాన్ని పునఃప్రారంభించామని మంత్రి తెలిపారు. అమరావతి నిర్మాణంపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని నిలదీస్తూ మంత్రి కొన్ని గణాంకాలను వెల్లడించారు. తెలంగాణ సెక్రటేరియట్ నిర్మాణానికి మొదట 7 లక్షల చదరపు అడుగులకు రూ.615 కోట్లతో టెండర్లు పిలిచారని, తరువాత విస్తీర్ణం పెరగడంతో మొత్తం ఖర్చు రూ.1423 కోట్లకు చేరిందన్నారు. అంటే ఒక్కో చదరపు అడుగుకు సుమారు రూ.13,763 ఖర్చయిందని వివరించారు. అలాగే పార్లమెంట్ భవనం నిర్మాణానికి ప్రారంభంలో రూ.862 కోట్లతో టెండర్లు పిలిచినా, అనంతరం ఇతర పనులు కలిపి మొత్తం ఖర్చు రూ.1174 కోట్లకు చేరిందన్నారు. దీనితో చదరపు అడుగుకు సుమారు రూ.16,916 ఖర్చయిందని తెలిపారు. అమరావతిలో రోడ్ల నిర్మాణంపై కూడా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి అన్నారు. జాతీయ రహదారులు వేయడం అంటే కేవలం రోడ్డు నిర్మాణమే జరుగుతుందని, కానీ అమరావతిలో రోడ్లతో పాటు డ్రైనేజీలు, తాగునీటి పైపులైన్లు, విద్యుత్ లైన్లు వంటి మౌలిక సదుపాయాలన్నీ కలిపి నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. అందుకే నిర్మాణ వ్యయం ఎక్కువగా కనిపిస్తుందని చెప్పారు. నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరగడం వల్ల కూడా ఖర్చు పెరిగిందని మంత్రి వివరించారు. 2014--19 కాలంలో బిటుమెన్ టన్నుకు రూ.24,470 ఉండగా ప్రస్తుతం రూ.44,862కు పెరిగిందన్నారు. అదే విధంగా ఉక్కు ధర కూడా టన్నుకు రూ.57,299 నుంచి రూ.80,234కు పెరిగిందని చెప్పారు. అమరావతిలో నిర్మాణ కాంట్రాక్టులు ఒకే వర్గానికి ఇచ్చారన్న ఆరోపణలను కూడా మంత్రి ఖండించారు. అన్ని పనులకు పారదర్శకంగా ఆన్‌లైన్ ద్వారా టెండర్లు పిలిచామని, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి సంస్థలకు కూడా పాల్గొనే అవకాశం కల్పించామని తెలిపారు.

# అప్పుడు లావణ్య.. ఇప్పుడు మృణాల్.. అల్లు అరవింద్ బ్లెస్సింగ్స్



స్టేజ్‌పై సరదాగా మాట్లాడే టాలీవుడ్ ప్రముఖుల్లో నిర్మాత అల్లు అరవింద్ ఒకరు. సినిమాకు సంబంధించిన ఈవెంట్లలో ఆయన స్పీచ్ ఎప్పుడూ నవ్వించేలా ఉంటుంది. అలాగే టాలెంట్ ఉన్న యువ నటీనటులను ప్రోత్సహించేలా ఆయన మాటలు ఉంటాయి. కొన్ని సందర్భాలలో వాళ్ల ప్రేమ విషయాలను కూడా బయటపెడుతుంటాడు. అయితే ఆయనకు తెలిసి అంటాడో తెలియక అంటాడో తెలియదు కానీ.. ఆయన నోటి నుంచి వచ్చిన మాటలు కొన్నిసార్లు నిజమవుతుంటాయి. ఓ సినిమా ఈవెంట్‌లో లావణ్య త్రిపాఠిని ఉద్దేశిస్తూ..'తెలుగు చక్కగా మాట్లాడుతున్నావు.కాబట్టి ఇక్కడ అబ్బాయినే పెళ్లి చేసుకుంటే బాగుంటుంది' అని దీవించగా..ఆయన మాటలే నిజమై.. వరుణ్ తేజ్‌ని పెళ్లి చేసుకుంది. ఇక తాజాగా ఆయన మరో నటిపై కూడా అలాంటి వ్యాఖ్యలే చేశాడు. సీతారామం ఫేం మృణాల్ ఠాకుర్‌ని కూడా తెలుగు అబ్బాయినే పెళ్లి చేసుకోమని సలహా ఇచ్చాడు. తాజాగా ఆయన అడివి శేష్-మృణాల్ జంటగా నటించిన 'డెకాయిట్' మూవీ సక్సెస్ మీట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మృణాల్ పెళ్లి గురించి ప్రస్తావిస్తూ.. లావణ్య మాదిరే నువ్వు కూడా తెలుగు అబ్బాయినే పెళ్లి చేసుకొని ఇక్కడే సెటిల్ అవ్వాలని కోరుకుంటున్నాను అని అన్నాడు. 'ఇంతకు ముందు ఒక అమ్మాయిని(లావణ్య త్రిపాఠి) దీవించాను. ఆమె మా వరుణ్ తేజ్ భార్య అయిపోయింది. అలాగే నువ్వు(మృణాల్) కూడా ఇక్కడ అబ్బాయినే పెళ్లి చేసుకోవాలని కోరుకుంటున్నాను. మీరు మాకు(టాలీవుడ్) కావాలి. అందుకే తెలుగు అబ్బాయిని పెళ్లి చేసుకోవాలని కోరుకుంటున్నా' అని అరవింద్ నవ్వుతూ అన్నాడు.

# యోధుడిలా అరవింద్ కృష్ణ



అరవింద్ కృష్ణ, చుంకీ పాండే, అర్చనా శాస్త్రి, ప్రిన్స్, దివి ప్రధాన పాత్రల్లో రాకీ షెర్మాన్ తెరకెక్కిస్తున్న చిత్రం 'కర్మస్థలం'. రాయ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం సాయి కార్తిక్ సంగీతాన్ని అందిస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక తాజాగా ఈ సినిమా నుంచి అరవింద్ కృష్ణ పాత్రకు సంబంధించిన లుక్‌ను, మేకింగ్ వీడియోని షేర్ చేశారు. అరవింద్ కృష్ణ ప్రస్తుతం సూపర్ హీరో పాత్రలతో ఆడియెన్స్‌ను ఆకట్టునేందుకు రెడీ అవుతన్నారు. ఇలాంటి టైంలో ఓ యోధుడిలా 'కర్మస్థలం'లో కనిపించబోతోన్నారు. తాజాగా ఆయన పాత్రకు సంబంధించిన లుక్, మేకింగ్ వీడియోని రిలీజ్ చేశారు. ఇక సెట్‌లోనే అరవింద్ కృష్ణ చేస్తున్న వర్కౌట్స్, రిహార్సల్స్ అన్నీ కూడా ఎంతో నేచురల్‌గా ఉన్నాయి. గుర్రపు స్వారీ కూడా ఈ చిత్రంలో హైలెట్ అయ్యేలా కనిపిస్తుంది. విజువల్స్, బీజీఎం ఈ సినిమాను అదనపు ఆకర్షణ అయ్యేలా ఉంది.

# నవ్వుని నటిస్తూ బతుకుతున్న ప్రతి మగాడి కథ



అడపాదడపా హీరోగా సినిమాలు చేసే తిరువీర్ నుంచి వస్తున్న లేటెస్ట్ మూవీ 'పాపం ప్రతాప్'. గతేడాది డిసెంబరులో 'ద గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' చిత్రంతో హిట్ కొట్టిన ఇతడు.. ఇప్పుడీ సినిమాతో ప్రేక్షకుల ముందుకొస్తున్నాడు. ఈ శుక్రవారమే థియేటర్లలోకి రానుండగా తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ఇది ఆకట్టుకునేలా ఉంది. 1998లో గోదావరిలో జరిగే కథగా దీన్ని చూపించారు. ప్రతాప్, బుజ్జమ్మని పెళ్లి చేసుకుంటాడు. కానీ మూడో రోజే ఆమె.. ప్రతాప్‌ని వదిలి వెళ్లిపోతుంది. తర్వాతరోజు పెద్ద మనుషుల దగ్గర పంచాయతీ పెడుతుంది. ఇంతకీ వీళ్లిద్దరి మధ్య ఏం జరిగింది? ప్రతాప్ ఏమైనా చేశాడా? ప్రతాప్‌కే ఏమైనా జరిగిందా అనేదే కాన్సెప్ట్‌లా అనిపిస్తుంది. 'ఒకమ్మాయి ఇల్లు వదిలి వెళ్లిందంటే అబ్బాయి ఏం చేశాడని అడుగుతారు. కానీ ఆ అబ్బాయికి ఏం జరిగిందని ఎవరూ అడగరు' అనే డైలాగ్ ఆసక్తికరంగా అనిపించింది. నవ్వుని నటిస్తూ బతుకుతున్న ప్రతి మగాడి కథ అని చివరో ఓ లైన్ వేశారు.



# 2030 దాకా నేనే నెంబర్‌వన్.. అల్లు అర్జున్ ఆలోచన అదేనా?

స్టార్స్ జీవితంలో ఒక భారీ విజయం దక్కడం సులభమే కావచ్చు... కానీ దానిని నిలబెట్టుకోవడం కొనసాగించడం మాత్రం అంత సులభం కాదు. టాలీవుడ్‌లో ప్రస్తుతం స్టార్ డమ్ అనేది చాలా అస్థిమితంగా మారింది. ఖచ్చితంగా నెంబర్ వన్ హీరో ఎవరు అంటే చెప్పలేని పరిస్థితి నెలకొంది. ప్రేక్షకులు ఒక్కో ఏడాది ఒక్కో హీరో చిత్రానికి పట్టం కడుతుండడంతో నెంబర్లాట దోబూచులాటగా మారుతోంది. ఈ పరిస్థితిలో ప్రస్తుతానికి మాత్రం ఇటు కలెక్షన్స్ పరంగా చూసినా అటు రెమ్యునరేషన్ పరంగా చూసినా, అల్లు అర్జున్ నెం1గా నిలుస్తున్నాడనేది నిర్వివాదం. తాజాగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తన చిత్రం 'రాకా' కోసం ఏకంగా రూ.300 కోట్ల వరకూ రెమ్యునరేషన్ తీసుకుని సమకాలీన హీరోల్లో ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు బన్నీ. ఎవరూ ఊహించని విధంగా అప్పటి వరకూ 5, 6 స్థానంలో ఉన్న స్టైలిష్ స్టార్ కాస్తా ఒక్క ఉదుటున నెం1 ఐకాన్ స్టార్‌గా చేసింది పుష్పరాజ్ పాత్ర. ప్రస్తుతం అల్లు అర్జున్ హవా నడుస్తున్నప్పటికీ ఇది వన్ సినిమా వండర్ అనీ త్వరలోనే మరో టాప్ హీరో నెం1 ఛెయిర్‌ని ఆక్రమిస్తాడని సినీ పండితుల్లో పలువురు భావిస్తున్నారు. మరోవైపు బన్నీ మాత్రం ఈ ఊహాగానాలను పటాపంచలు చేయాలని, తన స్టార్ డమ్‌ని మరింత పెంచే విధంగా పకడ్బందీ ప్రణాళికలు రచిస్తున్నట్టు కనిపిస్తోంది. కనీసం 2030 వరకూ తన ప్లేస్‌ని శాశ్వతం చేసుకునేలా తదుపరి ప్రాజెక్టులను ఆయన జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటున్నాడు. పుష్ప తర్వాత అల్లు అర్జున్ ఎంపికలు చూస్తే ఆ విషయం సులభంగా అర్థమవుతుంది. జవాన్ లాంటి భారీ హిట్ ఇచ్చిన అట్లీని తన తదుపరి సినిమాకు ఎంపిక చేసుకోవడం ద్వారా తన భవిష్యత్తు ప్రయాణం ఎలా ఉండబోతోందో చెప్పకనే చెప్పాడు. ఆ తర్వాత దక్షిణాదిలో భారీ హిట్స్‌కి కేరాఫ్‌గా నిలిచిన లోకేష్ కనగరాజ్, అదే విధంగా మళయాళ పరిశ్రమకు చెందిన బాసిల్ జోసెఫ్‌లను ఐకాన్ స్టార్ జోడీ కట్టడానికి నిర్ణయించుకున్నట్టు సమాచారం. అంతేకాకుండా అల్లు అర్జున్ ప్రశాంత్ నీల్, సందీప్ రెడ్డి వంగా వంటి ప్రముఖ దర్శకులతో సైతం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అందుతున్న సమాచారం ప్రకారం, అతని రాబోయే ప్రాజెక్ట్‌లతో ముడిపడి ఉన్న ఇతర పేర్లలో త్రివిక్రమ్ శ్రీనివాస్ కూడా ఉన్నారు. మొత్తంగా చూస్తే విభిన్నమైన జానర్‌ల మిశ్రమాన్ని అందించడం ద్వారా భారతీయ చిత్రసీమలో తనదైన హవాను ఆయన కొనసాగించాలని ఆలోచిస్తున్నట్టు అర్థం అవుతుంది.

# యాంకర్ విష్ణుప్రియపై అసభ్య కంటెంట్ ఆరోపణలు..

## ఇలాంటి చర్యలకు పాల్పడడం సిగ్గుచేటు...



యాంకర్ విష్ణుప్రియ భీమినేని చుట్టూ సోషల్ మీడియాలో కొత్త వివాదం చెలరేగింది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అసభ్యకర కంటెంట్‌ను ప్రోత్సహిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తడంతో, ఏఐఎస్ఎఫ్ నాయకులు పోలీసులను ఆశ్రయించారు. శనివారం విజయవాడలోని సూర్యారావుపేట సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఏఐఎస్ఎఫ్ నేతలు అధికారిక ఫిర్యాదు సమర్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. సాయికుమార్ నేతృత్వంలో ఈ ఫిర్యాదు ఇచ్చినట్లు సమాచారం.తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అర్ధనగ్న వీడియోలు వీక్షించాలంటే సభ్యత్వ రుసుము చెల్లించాలని విష్ణుప్రియ ప్రచారం చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ నేతలు ఆరోపించారు. టెలివిజన్ షోల ద్వారా మంచి గుర్తింపు పొందిన ఒక ప్రజాప్రతినిధి స్థాయి సెలబ్రిటీ, ఇలాంటి కంటెంట్‌ను ప్రోత్సహించడం యువతపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో ఆదర్శంగా ఉండాల్సిన వ్యక్తులు డబ్బు కోసం ఇలాంటి చర్యలకు పాల్పడటం సిగ్గుచేటని ఏఐఎస్ఎఫ్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఈ తరహా కంటెంట్ వల్ల సమాజంలో నైతిక విలువలు దెబ్బతింటాయని వారు పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఏఐఎస్ఎఫ్ నేతలు రెండు ప్రధాన డిమాండ్లు చేశారు. విష్ణుప్రియ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తక్షణమే నిలిపివేయాలి, అలానే ఐటీ చట్టం మరియు సంబంధిత సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి ఫిర్యాదు చేసిన సమయంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దీపక్, సిద్ధు, మనోజ్ సహా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. సమాజంలో ఇలాంటి ధోరణులను సహించబోమని, అవసరమైతే న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. సోషల్ మీడియా కంటెంట్‌పై బాధ్యత, నైతికత అంశాలు మరోసారి చర్చకు వచ్చాయి. ఈ వ్యవహారంపై పోలీసులు ఎలా స్పందిస్తారు? విష్ణుప్రియ నుంచి ఎలాంటి క్లారిటీ వస్తుంది? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# బాక్సాఫీస్ దగ్గర 'డెకాయిట్' దూకుడు.. అడివి శేష్ కెరీర్‌లోనే భారీ ఓపెనింగ్స్



టాలీవుడ్ హీరో అడివి శేష్ నటించిన తాజా చిత్రం డెకాయిట్ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. విడుదలైన మొదటి రోజునుంచే మంచి టాక్ తెచ్చుకున్న ఈ సినిమా, రెండు రోజుల్లోనే భారీ వసూళ్లు సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. ఈ చిత్రం అడివి శేష్ కెరీర్‌లోనే అత్యుత్తమ ఓపెనింగ్స్ సాధించిన సినిమాగా నిలవడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా తొలి రెండు రోజుల్లోనే సుమారు రూ.28 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. మొదటి రోజు రూ.15 కోట్లు, రెండో రోజు రూ.13 కోట్లు రాబట్టడం ద్వారా ఈ సినిమా మంచి కలెక్షన్లను కొనసాగిస్తోంది. ఇక హిందీ వెర్షన్ కూడా ఆశించిన దానికంటే మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. మొదటి రోజు రూ.1.3 కోట్లు వసూలు చేసిన ఈ చిత్రం, రెండో రోజు రూ.1.75 కోట్లకు పెరగడం గమనార్హం. సాధారణంగా రెండో రోజు డ్రాప్ కనిపించే సందర్భాల్లో, ఈ సినిమా మాత్రం గ్రోత్ నమోదు చేయడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అంతేకాదు, విదేశాల్లో కూడా 'డెకాయిట్' మంచి రన్ కొనసాగిస్తోంది. ముఖ్యంగా అమెరికా మార్కెట్‌లో బలమైన వసూళ్లు సాధిస్తూ, ఇప్పటికే వి1 మిలియన్ మార్క్‌ను దాటడం చిత్ర బృందానికి పెద్ద ప్లస్‌గా మారింది. ఎమోషనల్ ఫీల్ గుడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించింది. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ఇద్దరి నటన కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా శేష్ తన పాత్రలో చూపిన ఇంటెన్సిటీ, భావోద్వేగాలు సినిమాకు ప్రధాన బలం అయ్యాయి. సినిమా టేకింగ్, మేకింగ్ విలువలు, కథనం అన్నీ కలిసి ఈ చిత్రాన్ని మరింత బలంగా నిలబెట్టాయి. ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్ రావడంతో వీకెండ్‌లో కలెక్షన్లు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాతలు సుప్రియ యార్లగడ్డ, సునీల్ నారంగ్ నిర్మించారు. మంచి కంటెంట్‌తో పాటు బలమైన ప్రెజెంటేషన్‌తో వచ్చిన 'డెకాయిట్' సినిమా బాక్సాఫీస్ వద్ద మరో హిట్‌గా నిలిచే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ సినిమాకి పోటీగా శర్వానంద్ బైకర్ చిత్రం కూడా విడుదల కాగా, ఈ మూవీ కూడా పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది.

Printed and Published by G. Narendra, Editor,1-4-55, Bapatla, Bapatla District.Phone: 8185 997507...